
కథ

# ఔన్నత్యం

- మొలుగు కమలాకాంత్

**ఆ రోజు ఆఫీసు అంతా కోలాహలంగా ఉంది. ఆ ఒక్కచోటేమిటి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 48 బ్రాంచ్‌ల్లోనూ తమ కంపెనీ ఎం.డి. గారబ్బాయి జన్మదిన వేడుకలు.... సంబరాలు..... స్టాఫ్ అందరికీ ఏవో చిన్న చిన్న నజరానాలు అందచేశారు. వాళ్ళది మెయిన్ ఆఫీసు కావడంతో పాటు ఎం.డి.గారబ్బాయి దినేష్ కూడా ఆ రోజు విజయవాడలోనే ఉండడంతో తులసి వాళ్ళ ఆఫీసు సందడి మరీ ఎక్కువగా ఉంది. సాయంత్రం హోటల్ డి.వి.మనోర్‌లో భారీ పార్టీ. ఆడా,మగా స్టాఫ్ అంతా హడావిడిగా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.**



తులసి మాత్రం యధావిధిగా తన పని చేసుకుపోతోంది. ''సారీ, నాకింకో ఇంపార్టెంట్ ఎంగేజ్‌మెంట్ ఉంది. నేను పార్టీకి రాలేను.'' సున్నితంగా, నిర్మోహమాటంగా కొలీగ్ జ్యోత్స్నతో చెప్పి ఇంటికి బయల్దేరింది.

'' హు...ఏమి పోజు... ఎప్పుడూ ఏదో అర్జెంట్ పనే, ఇంపార్టెంట్ ఎంగేజ్‌మెంటే అమ్మగారికి'' వెళ్ళిపోతున్న తులసిని చూస్తూ జ్యోత్స్న విసుర్లు.

''ఎం.డి.గారబ్బాయి ఇచ్చే పార్టీ కన్నా 'అంత ముఖ్యమైన ఎంగేజ్‌మెంట్' ఏమిటో'' ఎంగేజ్‌మెంట్ అన్న పదాన్ని నొక్కి పలుకుతూ మాధవి వెటకారం.

''ఇప్పుడెందుకు లేవే, రేపొచ్చాక ఏం చెబుతుందో చూద్దాం'' ఇద్దరూ ప్రస్తుతానికి సరిపెట్టుకున్నారు.

తులసి ఆఫీసు నించి కాళ్ళీడ్చుకుంటూ అరకిలోమీటర్ దూరం నడిచి సిటీబస్ ఎక్కి ఆరున్నరకి గమ్యం చేరింది.

ఆటో అయితే ఆఫీసు ముందే ఎక్కవచ్చు.... కానీ ఎనిమిది రూపాయలు అదనంగా ఖర్చు. ఎందుకు? దండగ!

ఆ రోజు ముక్కోటి ఏకాదాశి, డిసెంబర్ చివరి వారం కావడంతో చలి తీవ్రంగా ఉంది. వేంకటేశ్వర స్వామి కోవెలలో వందలాది మంది ఉత్తర ద్వార

దర్శనం చేసుకున్నారు....తులసి కూడా.

ఆ రోజు పొద్దున్నే అనుకుంది...ఆ గుడి అరుగుల మీద రాత్రిపూట ఎము కలు కొరికే చలిలో పడుకునే అభాగ్యులకి దుప్పటిస్తే...చలికి వణికే వగ్గులకి రగ్గులిస్తే...వాళ్ల మొహాల్లోని కాంతి ఎలా ఉంటుందో చూడాలి.

ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నంత మాత్రాన పుణ్యం వచ్చి పడిపో తుందా? మనిషి జన్మెత్తాక సాటి మనిషిని గురించిన స్పృహ లేనప్పుడెందుకీ దర్శనాలు?

ఎం.డి.గారబ్బాయి ఒక రోజు పుట్టిన రోజు పార్టీ ఖర్చుతో వందలాది మంది పేదలని చలి నుంచి దూరం చెయ్యొచ్చు. స్టాఫ్‌కి, ఫ్రెండ్స్‌కి పార్టీ ఇచ్చే బదులు పేదలకు అన్నదానం చెయ్యవచ్చు గదా!

తులసి నేరుగా బస్‌స్టాఫ్ నుంచి బట్టలకొట్టుకి వెళ్లింది. ఓ డజను రగ్గులు కొని, రిక్షాలో వేయించి వెంకటేశ్వరస్వామి కోవెల దగ్గరికి వెళ్లింది.

ఆ దేవాలయపు అరుగుల మీద కూర్చున్న ముసలీ, ముతకా వాళ్లకి రగ్గుల్ని పంచి, మిగిలిన ఆ ఒక్క దాన్నీ రిక్షా అబ్బాయికి ఇచ్చింది.

అలా చేస్తున్నప్పుడు వాళ్ల కళ్లలోని వెలుగుని, ఆనందాన్ని చూస్తే ఉత్తర ద్వార దర్శనాన్ని మించిన తృప్తి కలిగిందామెకు. 'మానవ సేవే మాధవ సేవ' అన్నారు కదా!


''ఆ కక్కుర్తి మంద...రేపెవడు తినాలని? బోలెడు సంపాదన! ఓ పిల్లాణ్ణైనా పెంచుకోవచ్చుగదా!'' అటుగా వచ్చిన ప్రసాద్ అంటే....

''వేరే ఎవణ్ణో ఎందుకు సార్? నన్ను పెంచుకోవచ్చుగా! పుత్రుణ్ణై పున్నామ నరకం నించి తప్పిస్తాను. కనీసం తలకొరివి పెట్టడానికైనా పనికొస్తాను....పోతే ఏడవడానికి కనీసం నేను ఒక్కణ్ణైనా ఉంటాను.'' అటెండర్ యాదగిరి జోకులు.

మిగిలిన నలుగురి పకపక నవ్వులు...

ఈ కామెంట్స్ అన్నీ వినబడుతున్నా పట్టించుకోకుండా తన వర్క్‌లో మరింత తీక్షణంగా నిమగ్నమై పోయింది...ఆ గంజాయి వనంలో 'తులసీమొక్క.'

తమ కామెంట్స్‌కి అటునించి ఎటువంటి రెస్పాన్సూ రాకపోవడంతో నిరాశ చెంది, ఎవరికి వారు తోక ముడిచారు.



మర్నాడు ఆఫీసులో స్టాఫ్ అంతా రాత్రి పార్టీ గురించిన చర్చలు, జోక్‌లు...

'' రాత్రి వేరే 'ఎంగేజ్‌మెంట్' బాగా జరిగిందా తులసీ?'' జోత్స్న, మాధురి పలకరింపులోనే వ్యంగ్యం.

''ఆ.....'' పొడిగా సమాధానమిచ్చి పనిలో నిమగ్నమైంది తుల సి...ఆమె సీత దగ్గరకు వెళ్లగానే....

'' ఓ పిల్లా పాపా...లింగులిటుకుమంటూ ఇంట్లో ఇద్దరు...ఏం తోచి చస్తుందో...ఠంచనుగా అయిదున్నరవగానే ఇంటికి పరిగెట్టడం దేని కో...అదీ ఈ వయసులో'' జ్యోత్స్న వెకిలిగా నవ్వుతూ అంటుంటే.....

'' ఆ...సడలే సంబడం...దేనికీ రూపాయి తియ్యదు...ఆఖరికి ఎం.డి గారబ్బాయి గిఫ్ట్‌కి కూడా పైసా ఇవ్వలేదాయె...మొగుడూ, పెళ్లాం ఇంట్లో డబ్బులెక్కబెట్టుకుంటూ కూర్చుంటారేమో'' మాధవి కామెంట్....

ఆ రోజు సాయంత్రం తులసి తనకి అర్జెంట్ పనుం దని చెప్పి గంట ముందే పర్మిషన్ పెట్టి వెళ్లిపోయింది.

ఆశ్చర్యపోవడం అందరి వంతైంది. వాళ్లంద రినీ ఎక్కువ బాధ పెట్టే అంశం...వాళ్లెన్ని కామెంట్స్ చేసినా కనీసం పట్టించుకోని తులసి నిర్లక్ష్యం.... ఎంత పొగరు?

అంతా ఆ సాయంత్రం చర్చించుకుని ఒక నిర్ణ యానికి వచ్చారు.

ఆ మర్నాడు తులసి రాగానే వయస్సులో పెద్ద వాడైన సీనియర్ ఉద్యోగి భానుమూర్తితో క్లాస్ పీకిం చాలని.

బధిరుల శరణాలయంలో పిల్లలకి క్రిస్మస్ సందర్భంగా 40 జతల చెప్పులు కొని చ్చింది తులసి...అవి వేసుకుని అమి తానందాన్ని పొందుతున్న ఆ అల్ప

సంతోషులని చూస్తుంటే గోరంత చేసిన దానికి కొండంత తృప్తి. ఈ పని కోసమే చెప్పులమ్మే బండి అబ్బాయిని శరణాలయానికి తీసికెళ్ళడానికే...గంట పర్మిషన్ పెట్టింది తులసి.

ఆ మర్నాడు ఆఫీసుకు రాగానే అందరి మొహాల్లో ఏదో ఉత్కంఠ....ఏదో జరగబోతున్న దన్న కుతూహలం.

వాతావరణంలో తేడాని పసిగట్టింది తులసి. అయినా కామ్‌గా సీట్‌లోకి వెళ్లి పని మొదలు పెట్టింది.

''అమ్మా... తులసీ'' అంటూ సీట్ ఎదురుగా కూర్చొని ఉపన్యాసమారంభించబోయిన భాను మూర్తికి....మూర్తిగారు! దయ చేసి హితబోధ చేయడానికి ప్రయత్నించి మీ గౌరవాన్ని పోగొట్టుకోకండి'' అంటూ స్థిరంగా, కఠినంగా తులసి చెప్పడంతో, క్షణాల్లో నోరు మూతపడింది.

* * *

''ప్రేమాలయం... వృద్ధుల శరణాలయం'' అన్న బోర్డు గట్టిగా కట్టి, అక్కడి మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు రాజారాం.

అక్కడున్న పెద్దలు, వృద్ధులు అంతా దాదాపుగా 65 ఏళ్లు పైబడ్డ వాళ్లే....కానీ వారందరికీ తండ్రి మాత్రం 55 ఏళ్ల రాజారాం.

ఇరవై నాలగ్గంటలూ వాళ్ళ ఆహారం, ఆరోగ్యం, నిద్ర...మంచీ...చెడ్డ, వాళ్ళ పిల్లలూ, మనవలూ, మనవరాళ్ల కథలూ...కబుర్లూ...ఇవే రాజారాంకి ఉన్న వ్యాపకాలు.

తెల్లవారు ఝామున ఐదింటికి లేచినప్పటి నించీ, రాత్రి పదిన్నరకి పడకునేదకా ఆయనకి వాళ్ల తోడిదే లోకం....వాళ్ళకి తండ్రైనా.... కొడుకైనా రాజారామే.

కృష్ణా కన్‌స్ట్రక్షన్స్ ఎం.డి. ధర్మారావు గారి సౌజన్యంతో ప్రతి రోజు ఓ ఎం.బి.బి.ఎస్ డాక్టర్ ఓ అర గంట సేపు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చి వెళ్తాడు.

తమకంటూ తరతరాలుగా వచ్చిన కొద్దిపాటి ఆస్తినీ, భార్య జీతాన్ని కలిపి రాజారం ఈ ప్రేమాలయాన్ని నడుపుతున్నాడు. తాము చేస్తున్న సేవకి ఎటువంటి గుర్తింపూ, ప్రచారమూ అవసరం లేదని ఆ దంపతుల నిశ్చితాభిప్రాయం.

ప్రచారాన్ని కోరీ, పుణ్యాన్ని ఆశించే ఏదైనా చేస్తే అది సేవే కాదనీ...... అటువంటి 'సేవ' వ్యర్థమనీ, స్వార్థపూరితమని ఆ జంట మనస్ఫూర్తిగా భావించేవారు.

పసి పిల్లల్లాంటి ఆ వృద్ధులనీ, అనాథలనీ చూసి వారికి సేవ నిస్వార్థంగా చేస్తూ జన్మల్ని పండించుకుంటున్న పుణ్య దంపతులు వాళ్లు.

***

''ఎం.డి.గారొస్తున్నారు'' యాదగిరి పరుగుపరుగున ఆఫీసులోకి వచ్చి ప్రకటించాడు.

అంతా వెంటనే ఎలర్ట్ అయి తమ తమ సీట్లలో బిజీగా ఉన్నట్లు నటించడం మొదలు పెట్టారు.

ఇంత సడెన్‌గా, అదీ ఎప్పుడూ రాని ఎం.డి. గారు రావడం అందరికీ ఆశ్చర్యంతో పాటు, రవ్వంత భయాన్ని కూడా కలిగించింది.

'అమ్మా తులసీ! నువ్వు అర్జెంట్‌గా రావాలమ్మా' మిగతా స్టాఫ్ అందరికీ ఆర్డర్ పాస్ చేశాడు.

ఎక్కడికెళ్తున్నారో, ఎందుకెళ్తున్నారో ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. కానీ ఎం.డి.గారి ఆర్డర్! తప్పదు గదా!

తులసి అయోమయంలో పడింది. ఈయనేమిటి ఇలా! ఈ టైమ్‌లో సడెన్‌గా రమ్మంటున్నాడు?

మిగతా వాళ్లందరికీ అంతకంటే సస్పెన్స్ కలిగించే విషయం... ఎం.డి.గారు ఆఫ్టరాల్ తులసిని 'అమ్మా తులసీ!' అంటూ పెరు పెట్టి మర్యాదగా పిలవడం...

కార్లు బయల్దేరాయి.... మొదటి కార్‌లో ఎం.డి, తులసీ, మిగిలిన 2 క్వాలీస్‌ల్లో మిగిలిన స్టాఫ్ జ్యోత్స్న, మాధవి, భానుమూర్తి, ప్రసాద్,యాదగిరి...మరో ఎనిమిమిది మంది.

కార్లు ''ప్రేమాలయం'' ముందు ఆగాయి.

అప్పటికే అక్కడ వందల సంఖ్యలో జనం.

తులసి మనసు కీడు శంకించింది...సమ్‌థింగ్ రాంగ్. ఆమె ఆలోచన నిజమే. పొద్దున్న తొమ్మిదింటికి తనొచ్చేటప్పుడు బానే ఉన్న రాజారాం... తన భర్త హార్ట్ ఫెయిలై 11 గంటలకు తుది శ్వాస విడిచాడు...లోకంలో తనకు ఏకైక తోడు.!

శవం చుట్టూ ఎందరో మనుషులు...అనాథ వృద్ధులు....అనాధ బాలలు...వికలాంగ బాలలు... బధిర బాలలు......అన్నార్తులు... దేవాలయాల దగ్గర చలికి ముడుచుకపోయిన వగ్గులు...

పెళ్లై పదేళ్లైనా పిల్లల్లేకపోతే ''మనిద్దరం ఒకరికొకరమై సాటి మానవసేవే లక్ష్యంగా బతకాలి'' అని ప్రతిన బూని బతికారిన్నాళ్లూ తులసీ, రాజారాం. ఎందరో అనాథలకు నాధులయ్యారు.

ఎం.డి. ధర్మారావు గారు మిగిలిన స్టాఫ్ వైపు తిరిగాడు. ''చూశారా! పోతే ఏడవడానికి ఒక్కడుండడన్నారే....చూడండి ఎన్ని వందలమంది మనస్ఫూర్తిగా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారో.... సాటి మనిషిని ఆదుకోని జన్మ ఓ జన్మేనా?

భర్త శవం దగ్గర కూర్చున్న తులసి అనుకుంది. ''రాజారాం...మనం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఆజన్మాంతం నిర్వహించడానికి త్రికరణ శుద్ధిగా ప్రయత్నిస్తాను. నువ్వులేకపోయినా...నేను మాత్రం అనాధను కాను. ఈ వందల మందిలో నేనూ ఒక దాన్నవుతాను...నీ స్ఫూర్తితో మరింత మానవ సేవ చేస్తాను....''

నిశ్చలంగా, నిశ్చయంతో ఉన్న ఆమె వదనాన్ని చదివిన ఎం.డి. ధర్మారావు అప్రయత్నంగా కన్నీరు కార్చాడు.

హిమాలయ మంతెత్తున గర్వంగా నించున్న 'తులసి-రాజారాం' దంపతుల ఔన్నత్యం ముందు పిపీలిక ప్రమాణంలో ఉన్న తమ వ్యక్తిత్వాన్ని చూసుకొని మిగిలిన స్టాఫ్ సిగ్గుతో తల దించుకున్నారు.

✻

## ఉదితాలో కొత్త మార్పు



ఉదితా గోస్వామి తెరపై కనిపించి చాలా కాలమైంది. 2004లో జాన్ అబ్రహం సరసన 'పాప్' సినిమాలో నటించి బాలీవుడ్‌లో ప్రవేశించిన ఈమె కెరీర్ ఇప్పటివరకూ మందకొడిగానే నడిచిందని చెప్పుకోవాలి. 2007లో 'అగర్'లో నటించిన తర్వాత ఇక నటించడం మానేసింది. ఇప్పుడు సంవత్సరం విరామం తర్వాత 'ఫాక్స్ అండ్ మాన్' ద్వారా మళ్ళీ నటిస్తోంది. నటనకు స్వస్తి పలికిందనుకున్న ఉదితా మళ్ళీ నటించాలని నిర్ణయం తీసుకోవడానికి కారణం ఏమిటి? ''గత డిసెంబరులో కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకోవడానికి నేను ఓ పది మంది స్నేహితులతో కలసి గోవా వెళ్ళాను. అక్కడ అంతా చాలా ఆనందంగా గడిచింది. అందరూ కొత్త సంవత్సరం కోసం కొత్త కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారు. అంతా రాబోయే సంవత్సరం పట్ల చాలా ఆశావాదంతో, ఉత్తేజంతో ఉన్నారు. కొత్త పనులు ప్రారంభించడానికి ఉవ్విళ్ళూరుతున్నారు. కాని నేను ముంబయి తిరిగి వెళ్ళాక అదే ఆశావాదంతో సంవత్సరాన్ని ప్రారంభించడానికి ఒక్క కారణం కూడా స్ఫురించలేదు. చాలా దిగులేసింది. ఇప్పటి వరకూ నాకు తగిన అవకాశాలు నా వైపే వస్తాయిలే అని ఊరుకునేదాన్ని. అవి అలా రావని తెలిసింది. ఇప్పుడు నేనే ప్రయత్నంతో సాధించుకుంటున్నాను. అలా లభించిందే 'ఫాక్స్ అండ్ మాన్'లో పాత్ర,'' అంటూ చెప్పుకొచ్చింది. మొత్తానికి మనమిప్పుడు మారిపోయిన ఉదితాను చూస్తున్నామన్నమాట!